# గోల్కొండ టైమ్స్

Regd. by Govt of India
No.UDYAM-TS-20-0003208

www.golcondatimes.com

బుధవారం 25, మార్చి 2026

పేజీలు : 02


## ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం

**ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో బిల్లు పెడుతున్నాం**

**ఆ భయంతోనే హడావిడిగా నాపై ఈ కార్ రేస్ చార్జిషీట్**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**



ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై తాము బిల్లు పెడుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హడావుడిగా తనపై ఫార్ములా–ఈ రేస్ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అక్రమ కేసు అని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'చిట్ చాట్'లో ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఇందులో అంగుళం కూడా నిజం లేదని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ,దీనిపై తాము అసెంబ్లీలో 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ కేసులో అధికారులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. "మీకు నాపై కక్ష ఉంటే నేరుగా నాపై తీర్చుకోండి. నిర్ణయం తీసుకున్నది నేను, కాబట్టి ఏ చర్యలైనా నాపైనే ఉండాలి. అనవసరంగా అధికారులను బలి చేయడం కరెక్ట్ కాదు," అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఫార్ములా–ఈ నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలను కేటీఆర్ కొట్టిపారేశారు. "ఒక్క రూపాయి కూడా దారి మళ్లలేదని స్పష్టం చేశారు. డబ్బులు నేరుగా కంపెనీకి వెళ్లాయన్నారు. అది అందరికీ కనిపిస్తోందని చెప్పారు. క్విడ్ ప్రో కో జరిగిందని చెబుతున్నారు కాంగ్రెస్ నేతలు.. మరి గ్రీన్ కో కంపెనీపై ఎందుకు కేసు పెట్టలేదో ? మీడియానే ఆలోచించాలన్నారు. మొదటి నుంచి చెబుతున్నా.. ఇది 100శాతం లొట్టపీసు కేసు. లేని కేసును ఉన్నట్లుగా మసిబూసి మారేడు కాయ చేస్తున్నారు. న్యాయపరంగా దీనిని ఎదుర్కొంటాం," అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## మతం మారితే ఎస్సీ హోదా గద్దు

**మత మార్పిడిలపై సుప్రీం కోర్టు**

**సంచలన తీర్పు**



**న్యూఢిల్లీ :** ఎస్సీ కులానికి చెందిన వారు మతం మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోకి కాకుండా ఇతర ఏ మతంలోకి మారిన వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. గతంలో ఏపీ హైకోర్టు జరిగిన విచారణలో.. క్రైస్తవ మతంలోకి మారిన పాస్టర్ ఎస్సీ ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని సుప్రీం న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు సుప్రీంకోర్టు మద్దతుగా నిలిచింది.

**అసలు కేసు ఇది**

గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో ఒక పాస్టర్‌పై జరిగిన దాడికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించినట్లు కోర్టు గుర్తించింది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని కోర్టు స్పష్టం చేసింది. దాడి జరిగిన సమయంలోనూ సదరు వ్యక్తి ప్రార్థనలు చేస్తున్నట్లు గుర్తించిన కోర్టు, ఈ వ్యాఖ్యలు చేసింది. తహశీల్దార్ ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ చట్టపరమైన రక్షణ పొందేందుకు సదరు వ్యక్తికి అర్హత ఉండదని కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని 341 అధికరణ ప్రకారం, ఎస్సీ హోదా కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే వారికి మాత్రమే పరిమితం చేయబడింది. మత మార్పిడి ద్వారా క్రైస్తవం, ఇస్లాం మతాన్ని స్వీకరించినప్పుడు సహజంగానే ఎస్సీ హోదా రద్దవుతుందని, తద్వారా అట్రాసిటీ చట్టం వర్తించదని హైకోర్టు ఈ కేసులో వ్యాఖ్యానించింది. ఈ తీర్పును సవాల్ చేసి సుప్రీంకి వెళ్లిన ఫాస్టర్ కు అక్కడ కూడా చేదు అనుభవం ఎదురైంది.

## మరో ఎనిమిదేళ్లు

# తెలంగాణలోనే ఉంటా

## దేశ రాజకీయాల విషయంలో హైకమాండ్ దే తుది నిర్ణయం

**బీఆర్ఎస్ నేతలే తెలంగాణలో నన్ను హీరో చేశారు**

**ఇప్పటికీ, ఎప్పటికీ తమ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది**

**ఢిల్లీలో**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**న్యూఢిల్లీ :**
తాను మరో ఎనిమిదేళ్ల పాటు తెలంగాణలో రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ తర్వాత దేశ రాజకీయాల అరంగేట్రం గురించి ఆలోచిస్తానని చెప్పారు. ఒకవేళ భవిష్యత్తులో దేశ రాజకీయాలకు తాను అవసరమని పార్టీ భావిస్తే, ఆ నిర్ణయాన్ని హైకమాండ్‌కే వదిలేస్తున్నానని చెప్పారు. దేశంలోనే తెలంగాణ డీఎన్ఏ భిన్నమైందన్న ఆయన ఇదొక వైబ్రెంట్ ప్లేస్ అని కొనియాడారు. తెలంగాణకు, గాంధీ కుటుంబానికి ఉన్న ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు.



తాను ఒక నాయకుడిలా కాకుండా, కార్యకర్తగానే భావిస్తానని, వారి కష్టనష్టాలు తనకు తెలుసని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఓ మీడియా ఛానెల్ డిబెట్ లో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలోని 'విలన్ల'తోనే ప్రజలు తనను 'హీరో'ను చేశారని సీఎం.. బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రామాయణంలో రావణుడు ఉన్నాడు కాబట్టే రాముడికి అంత పేరు వచ్చిందన్న ఆయన తెలంగాణలో గత పాలకుల తీరుతోనే కాంగ్రెస్‌కు, తనకు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఇప్పటికీ, ఎప్పటికీ తమ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీఎం మండిపడ్డారు.

ప్రధాని మోడీ అనుసరిస్తున్న 'త్రీడీ పాలసీ'కి వ్యతిరేకంగా దక్షిణ భారతదేశం మొత్తం ఏకం కావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆయన ఆరోపించారు. వెంకయ్య నాయుడుని రాష్ట్రపతిని చేయకుండా, కేవలం ఉపరాష్ట్రపతి పదవితో ఎందుకు సరిపెట్టారు?" అని ప్రశ్నించారు. కేంద్రంలో హోంశాఖ వంటి కీలక బాధ్యతలను దక్షిణాది నేతలకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో దక్షిణాదికి చెందిన వారు రాష్ట్రపతులుగా ఎదిగారని, రాజకీయ వివక్ష కేవలం బీజేపీలోనే కనిపిస్తోందని విమర్శించారు.



## అపరిచితులతో

# అప్రమత్తంగా ఉండాలి

**షీ టీమ్ పోలీసులు**

**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**

విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని దయానంద విద్యా మందిర్ పాఠశాలలో మంగళవారం షీ టీమ్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు, చేనప్ప మాట్లాడుతూ పాఠశాలకు, కళాశాలకు వచ్చిపోయే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాఠశాలలు, కాలేజీలు లేదా ప్రజా ప్రదేశాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినట్లయితే వెంటనే సమీప పోలీసులకు లేదా షీ టీంకు 8712670398 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సైబర్ నేరాల గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత సమాచారాన్ని అనవసరంగా పంచుకోవద్దని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, మెసేజ్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అలాగే ఈవ్ టీజింగ్, వేధింపులు, బాల్య వివాహాలు, చైల్డ్ అబ్యూస్ వంటి అంశాలపై చట్టపరమైన చర్యలను వివరించి, ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 181 మహిళల హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్ పోలీసులు జ్యోతి, కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే మా లక్ష్యం**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



**గోల్కొండ టైమ్స్, పటాన్‌చెరు :**

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లక్డారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలతో పాటు.. గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంత స్థలం ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటిని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3500 ఇల్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో రాజకీయాలకు అతీతంగా అర్హులకే వీటిని కేటాయించడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని దుర్వినియోగం చేయకుండా ఇళ్లను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. ఇళ్ల నిర్మాణ దశకు అనుగుణంగా నిధులు విడుదల అవుతాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇల్లు లేని కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా ఇళ్ల కేటాయింపును పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మున్సిపల్ కమిషనర్ వెంకటకిషన్, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొరాయించిన సర్వర్.. రిజిస్ట్రేషన్లకు బ్రేక్

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందని సేవలు**

**రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి పడిగాపులు**

**మధ్యాహ్నం తర్వాత సేవలు పున:ప్రారంభం**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

మొరాయించిన సర్వర్లతో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు గంటల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు సాగలేదు. దీంతో స్లాట్ బుకింగ్ చేసుకుని.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు.. గంటల తరబడి ఆఫీసుల ముందు పడిగాపులు కాశారు. మంగళవారం ఉదయం నుంచే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సర్వర్లు పనిచేయకుండా పోయాయి. ఫలితంగా తెలంగాణలో భూములు, ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. స్లాట్ బుకింగ్‌లు, చలాన్ల చెల్లింపులు కూడా ఆగిపోయాయి. ఈ క్రమంలోనే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి బదిలీ చేసేందుకు కార్యాలయాలకు వచ్చిన కొందరు నిరాశతో వెనుదిరిగి ఇంటికి వెళ్లారు. మరికొందరు సేవలు ప్రారంభమయ్యే వరకు అక్కడే వేచి చూశారు. కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను జనం నిలదీశారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లోని సర్వర్లలో సాంకేతిక లోపాలు తలెత్తడంతోనే ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయినట్లు సంబంధిత అధికారులు చెప్పినా వినకుండా వారితో వాగ్వాదానికి దిగారు. ఉదయం ఆఫీసులు ప్రారంభం అయినప్పటి నుంచే సర్వర్లు మొరాయించడంతో భూముల క్రయ, విక్రయాలు నిలిచిపోయి.. వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈ కేవైసీ సహా రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏ పనీ సాగలేదు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్లు బుక్ చేసుకుని.. కొనుగోలుదారులు, అమ్మకందారులు సాక్షులతో సహా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి ఉదయం నుంచి పడిగాపులు కాశారు. మరోవైపు.. దూర ప్రాంతాల నుంచి ఆఫీసులకు వచ్చిన వారు సర్వర్లు ఎప్పుడు పని చేస్తాయి.. తమ పని ఎప్పుడు అవుతుందో తెలియక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రిజిస్ట్రేషన్ల శాఖ మెయిన్ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయినట్లు గుర్తించిన అధికారులు.. టెక్నికల్ టీమ్‌లను రంగంలోకి దించారు. సర్వర్ మొరాయింపులను సరి చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తిరిగి సేవలను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

## నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీ, ప్రభుత్వానికే మంచిది

**మీడియాతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**నేను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాను**

**ఏ పదవి లేకపోయినా ప్రజల్లో ఆదరణ, గౌరవం ఉంది**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఏ పదవి లేకపోయినా ప్రజల్లో తనకు ఎనలేని ఆదరణ, గౌరవం ఉందన్నారు, తనకు మంత్రి పదవి ఇస్తే అది వ్యక్తిగతంగా తనకంటే కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వానికే మంచి పేరు తెస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రి పదవి విషయంలో గతంలో అధిష్టానం తనకు హామీ ఇచ్చిందన్న ఆయన అధిష్టానం ఇప్పుడు ఏం చేస్తుందో తనకు తెలియదన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తనలాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు పార్టీకి చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.

కేడర్‌లో పట్టున్న నేతలను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పరోక్షంగా గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి ఇబ్బందులు లేవని రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఈ నెల 23న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ ఏదీ జరగలేదన్న ఆయన అసెంబ్లీలో ఎదురుపడినప్పుడు కేవలం మర్యాదపూర్వకంగా పలకరించుకున్నామని తెలిపారు. మంగళవారం అసెంబ్లీ డైనింగ్ హాల్‌లో కేటీఆర్‌తో జరిపిన సుదీర్ఘ భేటీపై స్పందించిన ఆయన అది కేవలం సాధారణ సంభాషణ మాత్రమేనని చెప్పారు. అయితే, ఆ చర్చల్లో గత రాజకీయ పరిణామాలను ప్రస్తావించినట్లు ఆయన వెల్లడించారు. "2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 88 సీట్లు వచ్చినప్పటికీ, 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం మీరు చేసిన అతిపెద్ద తప్పు అని కేటీఆర్‌కు చెప్పాను," అని రాజగోపాల్ రెడ్డి వివరించారు. అంతకు ముందు అసెంబ్లీ డైనింగ్ హాల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



కేటీఆర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఒకే టేబుల్‌పై కూర్చుని లంచ్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా ప్రజా ప్రతినిధులు డైనింగ్ హాల్‌లో కలిసి భోజనం చేయడం సహజమే అయినప్పటికీ, ఈ ముగ్గురు నేతల భేటీ మాత్రం ప్రత్యేకత సంతరించుకుంది. భోజనం పూర్తయిన తర్వాత కూడా వారు అక్కడే ఉండి దాదాపు రెండు గంటల పాటు ఏకాంతంగా చర్చలు జరపడం ఆసక్తి రేకెత్తించింది.

## హైదరాబాద్‌లో

## రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

**అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు**

**ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో మంగళవారం రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ – స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార–పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో–చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు.

అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటి వారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార–పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

**చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్**

**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**

ప్రజలకు ప్రభుత్వ పథకాలు, చట్టాలు మరియు తమ హక్కులపై సరైన అవగాహన ఉండటం చాలా అవసరమని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మి పతిగౌడ్ అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మిరెడ్డిపల్లె గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ లక్ష్మి పతిగౌడ్ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని వారు పేర్కొన్నారు. పంటల సాగు, పశుపోషణ, నీటి యాజమాన్యం వంటి అంశాలు వ్యవసాయంలో కీలకమని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం, పంటల బీమా, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి సాంకేతిక పద్ధతులు రైతులకు ప్రయోజనకరమని వివరించారు.

రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించబడ్డాయని, మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాలు, బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలకార్మిక చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చిన్న వయస్సులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడం చట్టవిరుద్ధమని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మహిళల రక్షణకు వరకట్న నిషేధ చట్టం, సఖి సెంటర్, వోల్డేగే హోమ్ వంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. అదేవిధంగా నిత్యవసర సరుకుల చట్టం, వినియోగదారుల హక్కులు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పేద ప్రజలు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని, ఇందుకు 15100 నంబర్‌కు కాల్ చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహేష్, గ్రామ సర్పంచ్ లక్ష్మి , హెడ్ కానిస్టేబుల్ సురేందర్ నాయక్, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## అమెచ్యూర్ నెట్‌బాల్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**



నారాయణపేట జిల్లా అమెచ్యూర్ నెట్‌బాల్ అసోసియేషన్ లోగోను మంగళవారం హైదరాబాద్‌లో క్రీడాశాఖ మంత్రి వాకేటి శ్రీహరి నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డా. ఎస్. రమేష్, కార్యదర్శి డా.ఎం.రామ్‌మోహన్‌గౌడ్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, నారాయణపేట జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఎస్. వెంకటేష్, రఘుపేట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో నెట్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగు అని తెలిపారు. ఈ లోగో ఆవిష్కరణతో జిల్లాలో నెట్‌బాల్ క్రీడకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని వెల్లడించారు.

## కంటి రెప్ప కాటు వేస్తే..

**కన్న కూతుర్ని కడతేర్చిన కసాయి తండ్రి**

**సపోటా పండులో ఎలుకల మందుపెట్టి చంపిన వైనం**

**గోల్కొండ టైమ్స్, సంస్థాన్‌నారాయణపురం :**

కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రి కూతుర్ని కడతేర్చాడు. సపోటా పండులో ఎలుకల మందుపెట్టి ఆమె ప్రాణాలు తీశాడు. యాదాద్రి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం లచ్చమ్మగూడెంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వివరాల ప్రకారం.. వరికుప్పల రవికి మూడేళ్ల కింద స్వాతితో పెళ్లి అయింది. వీరికి మేఘన (2), 9 నెలల చిన్నారి మయూరి ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో చిన్న కుమార్తెతో కలిసి స్వాతి కొన్నాళ్లుగా అమ్మగారి ఊరిలో ఉంటోంది. మేఘన తండ్రి వద్ద ఉంటోంది. పెద్ద కూతురును తన వద్దకు పంపించాలని స్వాతి ఊరి పెద్దలను కోరింది. భర్త వినకపోవడంతో మాద్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేసింది. పోలీసులు నారాయణపురం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఇచ్చారు. దీంతో పోలీసులు రవిని పిలిపించి మాట్లాడారు. పెద్దమనుషుల సమక్షంలో సోమవారం మాట్లాడుకోవాల్సి ఉంది. అంతలోనే అతను తన కూతురును చంపాలని నిర్ణయించుకున్నాడు. శనివారం సపోటా పండులో ఎలుకల మందు పెట్టి కూతురుకు ఇచ్చాడు. దీంతో ఆ పండును తిన్న కూతురు కొద్దిసేపటికే వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తండ్రి కూడా నిద్రమాత్రలు, ఎలుకల మందు నీళ్లలో కలిపి తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు రవిని నల్లగొండ ఆసుపత్రికి, చిన్నారిని నిలోఫర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం చిన్నారి మృతిచెందింది. భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు రవి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు.



# పేద పిల్లల ఆకలిపై నైతిక ఉపన్యాసాల నాటకం

మన దేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అనేది పేద విద్యార్థుల ఆరోగ్యాన్ని, విద్యను మరియు సమగ్రాభివృద్ధిని పెంచడానికి తీసుకున్న ఒక గొప్ప ప్రయత్నం. మరియు పిల్లలని బడికి ఆకర్షించడం, డ్రాప్-అవుట్లను తగ్గించడం అనే ముఖ్య లక్ష్యాలను చేరుకోవడానికి. ఈ పథకం ద్వారా విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు, ఆరోగ్యకరమైన భోజనం అందుతున్నారు. ముఖ్యంగా, గుడ్డు వంటి పోషకాహార పదార్థాలను మధ్యాహ్న భోజనంలో ఇస్తున్నారని, వీటిని తినేవారు సరిగా పోషణ పొందుతున్నారు.

అయితే, కొందరు ప్రభుత్వవర్గ సలహాదారులు, ప్రవచనకర్తలు ఈ పథకాన్ని వ్యతిరేకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా గుడ్డు పెట్టడాన్ని "దండగ" అని పేర్కొని, పథకం వ్యర్థమని, ప్రభుత్వానికి అభ్యంతరం చూపించారు. వారు ఇది ప్రభుత్వ పథకాలలో తప్పిదం అని చెప్పినప్పటికీ, పేద విద్యార్థుల ఆకలి, విద్య, ఆరోగ్యం వంటి ముఖ్య అంశాలను పక్కన పెట్టి, విమర్శ చేస్తున్నారు.నిజానికి, మధ్యాహ్న భోజన పథకమే పేద విద్యార్థులకు ఒక వెలుగు. ఇది వారి కడుపు నింపుతుంది, బడికి రెగ్యులర్‌గా రాకుండా ఉన్న పిల్లలను బడికి రప్పిస్తుంది, చదువుకు ప్రేరేపిస్తుంది. ప్రభుత్వ పథకాల్లో నిజమైన "దండగమారి" పథకాలు ఉన్నప్పటికీ, ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని దానిలో చేర్చడం సరైనది కాదు.

> పసివాళ్లు ఖాళీ కడుపుతో స్కూల్ కి వస్తూ, బెంచ్ మీద తల వంచి కూర్చుంటే, వారి కోసం భోజనం ఇవ్వకపోవడం అంటే సొసైటీ ఫెయిల్, చట్ట విరుద్ధం, మానవత్వ విరుద్ధం. కేవలం పాఠాలు చెప్పడం ద్వారా పిల్లల హక్కు రక్షణ కాదు. పుస్తకాలు, ఉపకరణాలు, భోజనం ఇవన్నీ ప్రభుత్వ బాధ్యతలో భాగం. భారతదేశం అనగా మహోన్నత చరిత్ర, గొప్ప సంస్కృతి, దేవతల పుట్టిన భూమి అని మనం తరచుగా గర్వంగా చెప్పుకుంటాం. కానీ ఈ మహత్తర దేశంలో చిన్నారుల ప్రాణాలు రోజూ నిశ్శబ్దంగా నాశనం అవుతున్నాయి.

ఆకలి అనేది ప్రాణి పుట్టిన వెంటనే ఎదుర్కొనే ప్రాథమిక అవసరం. కడుపు నిండిన తర్వాతే జీవితం కొనసాగుతుంది. కడుపు నిండిన తర్వాతే జీవితం నిలవడానికి, కొనసాగడానికి అవసరమైన శక్తి, శక్తివంతమైన శారీరక, మానసిక స్థితి వస్తుంది. ఆకలి తీరని స్థితిలో, చదువును నేర్చుకోవడం, సంస్కారం పొందడం, ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవడం అనేవి అసాధ్యం. కొందరు "జ్ఞానులు" ఆకలిని కూడా సంప్రదాయం పేరుతో కొలుస్తున్నారు. తిండి లేని పసివాడికి పౌష్టికాహారం కంటే కఠిన నియమాలు ముఖ్యం అని చెప్పడం ఎంత క్షమించదగ్గది? ఆధ్యాత్మికత అంటే ఆత్మను వెలిగించడం ఎదుటివాడి కడుపులో ఏం ఉండాలి అని నిర్ణయించడం కాదు.

గరికపాటి వాక్పటుత్వం అద్భుతం, భాషపై అదనపు పట్టు ఉంది. కానీ పేద పిల్లల ఆకలి గురించి అవగాహన ఉందా? ప్రభుత్వ బడిలో చదివే పిల్లల పరిస్థితి తెలుసా? వారిలో చాలా వరకు ఇంట్లో కూడా మూడు పూటలు తినడానికి అవకాశం ఉండదు. అలాంటి పిల్లలకు ఒక కోడిగుడ్డు చిన్నదైనా కానీ అత్యంత కీలకమైన ప్రోటీన్. దాన్ని నిషేధించడం, హేళన చెయ్యడం వారి ఆరోగ్యం, ఎదుగుదలను పట్టించుకోకుండ చేయడం ఎంత ధైర్యం కావాలి. "ప్రభుత్వం పిల్లలకు కేవలం చదువు చెప్పడం మాత్రమే బాధ్యత, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఇవ్వడం బాధ్యత కాదు" అనడం అసలు న్యాయరీతికి, హక్కులకు, మానవత్వానికి విరుద్ధం.

ముందుగా, ఆర్టికల్ 21 – రైట్ టు లైఫ్‌ను




గమనించాలి. జీవితం కేవలం బ్రతకడమే కాదు, గౌరవంగా బ్రతకడం కూడా హక్కు. ఆ గౌరవంలో ఆరోగ్యం, పోషకాహారం, కనీస జీవన ప్రమాణాలు ముఖ్యమని చట్టం చెప్పింది. అర్థం ఏమిటంటే, పిల్లలు ఖాళీ కడుపుతో స్కూల్‌కి వస్తే, వారు చదువుకోలేరు. చదువు అంటే పుస్తకాలు మాత్రమే కాదు, కుర్చీ, భోజనం, సురక్షిత వాతావరణం కూడా ఉంటాయి.

రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ కూడా చెబుతోంది: విద్య హక్కు కేవలం పాఠాలు చెప్పడమే కాదు, విద్యార్థులకు అవసరమైన అన్ని మూలకాలను అందించడం పుస్తకాలు, ఉపకరణాలు, భోజనం, సౌకర్యం – అవసరం. "చదువు చెప్పి వదిలేయండి, భోజనం ఇవ్వకూడదు" అనే వాదన చట్ట వ్యతిరేకం, మానవత్వ వ్యతిరేకం.

2001లో సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింది: పిల్లలకు డ్రై రేషన్ కాదు, వండిన భోజనం ఇవ్వాలి. ఇది రాజకీయ నిర్ణయం కాదు, న్యాయ బలంతో బలపరిచిన హక్కు. మిడ్ డే మిల్స్ పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా పిల్లల హక్కుగా నిలిచింది.

పీఎం పోషణ పథకం కింద ప్రపంచంలోనే అతి పెద్ద ఆహారాన్ని అందించే స్కీమ్ గా పేరు తెచ్చుకున్న ఈ మధ్యాహ్న భోజన పథకంపై పిచ్చి ప్రేలాపనలను వెనక్కి తీసుకుని

> ఆకలి అనేది ప్రాణి పుట్టిన వెంటనే ఎదుర్కొనే ప్రాథమిక అవసరం. కడుపు నిండిన తర్వాతే జీవితం కొనసాగుతుంది. కడుపు నిండిన తర్వాతే జీవితం నిలవడానికి, కొనసాగడానికి అవసరమైన శక్తి, శక్తివంతమైన శారీరక, మానసిక స్థితి వస్తుంది. ఆకలి తీరని స్థితిలో, చదువును నేర్చుకోవడం, సంస్కారం పొందడం, ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవడం అనేవి అసాధ్యం. కొందరు "జ్ఞానులు" ఆకలిని కూడా సంప్రదాయం పేరుతో కొలుస్తున్నారు. తిండి లేని పసివాడికి పౌష్టికాహారం కంటే కఠిన నియమాలు ముఖ్యం అని చెప్పడం ఎంత క్షమించదగ్గది? ఆధ్యాత్మికత అంటే ఆత్మను వెలిగించడం ఎదుటివాడి కడుపులో ఏం ఉండాలి అని నిర్ణయించడం కాదు.

క్షమాపణ చెప్పాలి. పిల్లల Right to food & Right to live లను కాపాడాలి.

పసివాళ్లు ఖాళీ కడుపుతో స్కూల్‌కి వస్తూ, బెంచ్ మీద తల వంచి కూర్చుంటే, వారి కోసం భోజనం ఇవ్వకపోవడం అంటే సొసైటీ ఫెయిల్, చట్ట విరుద్ధం, మానవత్వ విరుద్ధం. కేవలం పాఠాలు చెప్పడం ద్వారా పిల్లల హక్కు రక్షణ కాదు. పుస్తకాలు, ఉపకరణాలు, భోజనం ఇవన్నీ ప్రభుత్వ బాధ్యతలో భాగం. భారతదేశం అనగా మహోన్నత చరిత్ర, గొప్ప సంస్కృతి, దేవతల పుట్టిన భూమి అని మనం తరచుగా గర్వంగా చెప్పుకుంటాం. కానీ ఈ మహత్తర దేశంలో చిన్నారుల ప్రాణాలు రోజూ నిశ్శబ్దంగా నాశనం అవుతున్నాయి. 2021 లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం సుమారుగా ఏడు లక్షల మంది చిన్నారులు శిశుమరణానికి లోనవుతున్నారు. ఈ మరణాలను ప్రభుత్వ లెక్కల్లో "హంగర్ డెత్స్"గా నమోదు చేయడం లేదు. అధికారుల మాట ప్రకారం, "వీరు ఆకలితో చనిపోలేదు, ఆకలి కారణంగా ఏర్పడిన వ్యాధులతో చనిపోయారు." కానీ నిజంగా, మరణాల్లో 70% వరకు ప్రధాన కారణం పోషకాహార లోపమే. జనాభాలో 12% మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. పిల్లల్లో 32.9% stunted (ఎత్తు తగ్గింది), 18.7% wasted (బరువు తగ్గింది). ఇవి భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సమస్యలకు, సామాజిక-ఆర్థిక పరిమితులకు ముప్పు.

ఇది ఇలా ఉంటే గరికపాటి వంటి కాలక్షేప కబుర్ల వ్యక్తులు పిల్లల మధ్యాహ్న భోజనంపై, అందులో గుడ్డు ఇవ్వడంపై అనవసర మాటలు.అర్థం లేని మాటలు అనడమే కాకుండా, పిల్లలను పట్టుకుని శోభనం రాత్రి పెళ్లి కొడుకు అని పిచ్చి ప్రేలాపనలు చేయడం దారుణం. గరికపాటి వ్యాఖ్యలు విన్నాక ఒకటి స్పష్టంగా అవుతుంది ఆయనకు ఆహారం అంటే "మడి-ఆచారం" మాత్రమే. కానీ పేదవాడికి ఆహారం అంటే జీవనాధారం. పిల్లల ఆకలి, వారి జీవనోపాధి గురించి ఆలోచించకపోవడం, వారిని వేదికలపై జోకుల కోసం ఉపయోగించడం నిజమైన నైతికతా పరమార్థం కాదు.

ప్రవచనాలు వినేవారు సంపన్నులు. వారికి కావాల్సింది కేవలం కాలక్షేపం. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు కావాల్సింది శక్తి, బలం, రేపటి పౌరులుగా ఎదగడానికి అవసరమైన ఆహారం. గుడ్డును తిరస్కరించడం, పిల్లల భవిష్యత్తును దెబ్బతీయడం. ప్రభుత్వ ఖర్చులు, నాయకుల ప్రయాణాల విలాసం మీద మీ గొంతు ఎందుకు శబ్దం చేయదు? పేదవారి కడుపు మీద మాత్రమే ప్రతాపాన్ని చూపడం ఏ రకమైన బాధ్యత?

నిజమైన ఆధ్యాత్మికత అంటే అందరినీ ప్రేమించడం, అందరి శ్రేయస్సు కోరడం. ఆహారం వ్యక్తిగత హక్కు, మరియు దానికి ఎవరు నియంత్రణ కలిగి ఉండరాదు. మీ ప్రసంగంలో వచ్చే ద్వేషం, అహంకారం, పిల్లల ఆకలి, సామాజిక సమానత్వాన్ని మింగేస్తుంది. పద్మశ్రీ గ్రహీతగా, మీరు సమాజాన్ని కలుపుకునే మాటలు మాత్రమే మాట్లాడాలి.

పాలు కల్తీ చేసి పసిపిల్లల ప్రాణాలు తీసినోడితో, వేలకోట్లు దోచుకుని నాసిరకం రోడ్లు వంతెలు నిర్మించినోడితో, ఇలా దేశాన్ని పలు రకాలుగా దోచుకుని దాచుకునే దొంగలతో మనకు ఎలాంటి సమస్యా ఉండదు.

కానీ పేదవాడి గంజిలో కాసింత పౌష్టిక ఆహారం కనబడితే ఓర్చుకోలేరు ఎందుకంటే ప్రశ్నించే ప్రతీవాడు పేదరికం రుచి చూసినోడు కాబట్టి. సమాజ అభివృద్ధి, ఆరోగ్యకరమైన భావి పౌరుల నిర్మాణం అంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు, నైతికత పేరుతో పేదలపై విద్వేషం చిమ్మే మాటలను సహించకూడదు.అలాంటి సామాజిక విషాన్ని వ్యాపింపజేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి.



– బసడ సంపత్ యాదవ్
+917032132593

---



## బీసీ వ్యతిరేక వైఖరిని
# కేంద్రం వీడాలి

- జనగణనలో బీసీ కుటుంబాలను కూడా లెక్కించాలి
- బీజేపీ, కాంగ్రెస్ రెండు బీసీ వ్యతిరేక పార్టీలే
- దేశవ్యాప్తంగా సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50%పరిమితిని ఎత్తివేయాలి
- మహిళా బిల్లులు బీసీ మహిళలకు సబ్ కోటా పెట్టాలి
- కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించే వరకు బీసీ ఉద్యమాన్ని కొనసాగిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్
- రెండో రోజు ఢిల్లీలో మెరుపు ధర్నా

**న్యూఢిల్లీ :** బీసీ డిమాండ్లు పరిష్కరించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి బీసీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రతిపక్ష పార్టీలు కూడా పూర్తిగా విఫలం అయ్యాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఆధ్వర్యంలో రెండోరోజు బీసీ డిమాండ్ల పరిష్కారం పై తెలంగాణ/ఆంధ్ర భవన్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పరిష్కారం నోచుకుని బీసీ సమస్యలను పార్లమెంట్ ను వేదికగా చేసుకుని చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్న కనీసం ప్రయత్నం కూడా అధికారంలో ఉన్న ఎన్ డి ఎ, ప్రతిపక్షంలో ఉన్న ఇండియా కూటమి లో చొరవ తీసుకోకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. బీసీ కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు, రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితి ఎత్తివేత, మహిళా బిల్లు లో బీసీ మహిళలకు సబ్ కోట, తదితర డిమాండ్ల పై పార్లమెంట్ లో కొట్లాడాల్సిన రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నాడని, డిమాండ్లను పరిష్కరించే బాధ్యత ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యతలను విస్మరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల విషయంలో కాంగ్రెస్ బిజెపి రెండు ఒకే తాను ముక్కలని, రెండు కూడా బీసీ వ్యతిరేక పార్టీలేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయ జనగణనలో బీసీ కుటుంబాలను లెక్కించే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అందులో భాగంగా అతి త్వరలోనే దేశంలోని 29 రాష్ట్రాల ఓబిసి ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో ఓబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ ని ఏర్పాటు చేసి రహదారుల దిగ్బంధం రైల్ రోకో లాంటి కార్యక్రమాలను ఉధృతం చేస్తామని అప్పుడు కూడా కేంద్రం స్పందించకపోతే భారత్ బంద్ పిలుపు ఇస్తామని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్రావు మాట్లాడుతూ.. 60 శాతం జనాభా ఉన్న బీసీలను పట్టించుకోకుండా కేంద్రం వ్యవహరించడం మంచి పరిణామం కాదని, బీసీ ప్రధాని నరేంద్ర మోడీ తప్పకుండా బీసీలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ కుటుంబాల లెక్కింపు కోసం కేంద్ర మంత్రులను, ప్రతిపక్ష పార్టీల నేతలను కలిసి జాతి జనగణలో బీసీ కులగణన జరిగేలా, కులగరణ జరిగిన తదుపరి జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్‌లు పెంచడానికి చర్యలు తీసుకోవాలని కూరనున్నట్లు శంకర్రావు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకురుమ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మణి మంజరి, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్, బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రావులకోల్ నరేష్ ప్రజాపతి, సంచార జాతుల సంఘం అధ్యక్షుడు కాటేపల్లి వీరస్వామి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్, బీసీ నేతలు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, సంస్థాన్ శ్రీనివాసరావు, సంధ్యారాణి, శివకుమార్, అరగంటి నాగరాజుగౌడ్, ఉదయనేత, గూడూరు భాస్కర్, కొప్పుల చందు, నాగరాజు, దేగల శ్రీనివాస్, కొత్త నరసింహస్వామి, బంగారు వెంకటేష్, సత్యరాజ్ గౌడ్, శివమ్మ, శైలజ, రేణుక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

---

## దౌల్తాబాద్‌లో
# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

### ప్రారంభించిన సర్పంచ్ వావిలాల సంగీత నర్సింలు

**గోల్కొండ టైమ్స్, హత్నూర :**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామపంచాయతీలో ని ఐదు, ఆరు, వార్డులో మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరైన 14 లక్షలతో నిర్మాణం చేపట్టే సీసీ రోడ్డు పనులను దౌల్తాబాద్ సర్పంచ్ వావిలాల సంగీత నర్సింలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దౌల్తాబాద్ గ్రామ అభివృద్ధికోసం కృషి చేస్తానన్నారు. గ్రామంలో అవసరమైన చోట అండర్ డ్రైనేజ్, వీధి దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో దౌల్తాబాద్ పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వావిలాల నర్సింలు, దౌల్తాబాద్ ఉప సర్పంచ్ పటేల్ శేఖర్‌గౌడ్, వార్డు సభ్యులు మహమ్మద్ గౌస్, యువ నాయకుడు తుమ్మలపల్లి కిశోర్, పి.యాదయ్య, కే.శ్రీనివాస్, పి.రవి, ఆ సాజి శ్రవణ్, శిరీష, శెట్టిపల్లి శైలజ, ఖాజా భాయ్, బిట్ల మహేష్, మాజీ ఉప సర్పంచి రియాజ్, కాంగ్రెస్ నాయకులు హకీమ్ వాహిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



---

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి
# సంపూర్ణ సహకారం

### పటాన్‌చెరు ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గూడెం మహిపాల్‌రెడ్డి



**గోల్కొండ టైమ్స్, పటాన్‌చెరు :**

పల్లె నుంచి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్ చెరు ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాఘనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

---

## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని
# ఆమోదించడం హర్షణీయం

### లాయర్స్ ఫోరం అధ్యక్షుడు నర్రి స్వామి



**గోల్కొండ టైమ్స్, చౌటుప్పల్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము న్యాయవాదులకు రక్షణ చట్టాలను ఏర్పాటు చేస్తామని చట్టాన్ని ఆమోదించడంపై తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా న్యాయవాదుల కోసం రక్షణ చట్టాలు ఏర్పాటు చేయాలని అనేకమైనటువంటి ఉద్యమాలు నిర్వహించామని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ చట్టాలను ఏర్పాటు చేస్తూ చట్టాన్ని ఆమోదించడం చాలా గర్వకారణం అన్నారు. చట్టాన్ని ప్రాణాలు అర్పించిన న్యాయవాదులకు అంకితం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనేక మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

---

## హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో..
# అధ్యక్ష పోటీలో సురేందర్‌రెడ్డి దూకుడు



### హైకోర్టు న్యాయవాదులందరి చూపు సురేందర్ రెడ్డి వైపే

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతున్న తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి రేసు ఉన్న అడ్వకేట్ సురేందర్ రెడ్డి దూసుకెళ్తున్నారు. 2026 మార్చి 26న జరగనున్న ఎన్నికల్లో న్యాయవాదవర్గాలన్నింటిల్లో ఆయన పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా నుండి వచ్చిన ఆయన... తన గురువులు, సీనియర్ కౌన్సెల్ వి. రవి కిరణ్ రావు, ఏపీ హైకోర్టు అదనపు అడ్వకేట్ జనరల్ ఇ. సాంబశివ ప్రతాప్ మద్దతుతో... అంకితభావంతో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. వృత్తి పట్ల నిలువెత్తు నిజాయితీ, అంకితభావం, సమగ్రత, నిబద్ధత అనే విలువలను తొలి నుంచి కాపాడుతూ న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టుల్లో సుమారు 28 సంవత్సరాల సక్సెస్‌ఫుల్ అడ్వకేట్ గా సేవలు అందించిన చరిత్ర సురేందర్ రెడ్డికి ఉన్నది.ఇదే హైకోర్టులో ఆయన 7,000 కేసులను వాదించిన రికార్డు సైతం ఉన్నది.

పార్కింగ్ సమస్యలు, కేసులు దాఖలు చేయడం, కేసు పోస్టింగ్‌లు, ఆర్డర్ కాపీలను స్వీకరించడంలో జాప్యం, రెగ్యులర్ ప్రాక్టీషనర్‌గా ఉండటం వల్ల యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సవాళ్ళపై ఆయనకు పూర్తిగా అవగాహన ఉన్నది. హైకోర్టులో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు, ఇబ్బందులను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడానికి ఆయన చాలా ఆచరణాత్మకంగా ముందుకు కదులుతున్నారు. ఎన్నికైన వెంటనే అవసరమైన మార్పులను అమలు చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని చెబుతూ సంచలనం సృష్టిస్తున్నారు. తెలంగాణ హైకోర్టులో విభిన్న నేపథ్యాల నుండి అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు న్యాయవాద వృత్తిలోకి ప్రవేశిస్తున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. అందుచేత, వారికి కోర్టులో అందే సౌకర్యాలపై ప్రత్యేక కృషి అనివార్యమని అందరూ అభిప్రాయపడుతున్నారు. న్యాయవాదుల ఆరోగ్యం పరిరక్షించేందుకు కోర్టు ప్రాంగణంలో అవసరమైన వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి సురేందర్ రెడ్డి హామీలు ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది.

అధ్యక్ష పోటీలో ఉన్న ప్రముఖ అడ్వకేట్ సురేందర్ రెడ్డి ఇదివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా (2006-07), కోశాధికారిగా (2008-09), కార్యదర్శిగా (2011-12)తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడిగా (2017-18) పనిచేసిన అనుభవం ఉన్నది. ఆయన పదవీ కాలంలో, గత అధ్యక్షుల సమర్థవంతమైన నాయకత్వంలో తెలంగాణ హైకోర్టు గౌరవం, మర్యాదను నిలబెట్టుకున్నది. ఇందులో ఆయన కృషి ఎంతగానో ఉన్నది. హైకోర్టులో లైబ్రరీని పునరుద్ధరించడం, ఖాతాలలో పారదర్శకతను ప్రవేశపెట్టడంలో సురేందర్ రెడ్డి సేవలు ఎంతో విశిష్టమైనవి.

ప్రస్తుత ఎన్నికల్లో కూడా అంతే నిబద్ధతతో సభ్యుల సంక్షేమం కోసం పని చేస్తానని చెబుతూ ఎన్నికల్లో విస్తృతం ప్రచారం చేస్తున్నారు. ఆయన హామీలు, వ్యాఖ్యలు న్యాయవాదుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. 2026-27 సంవత్సరానికి తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవాలని అభ్యర్థిస్తున్నారు. హైకోర్టు న్యాయవాదుల ఫిర్యాదులను పరిష్కరిస్తానని బెంచ్ అండ్ బార్ మధ్య స్నేహపూర్వక సంబంధాన్ని కొనసాగించడం ద్వారా ముందుకు అడుగులు వేస్తున్నారు. అయితే, అపార అనుభవం ఉన్న సురేందర్ రెడ్డికే అన్నివర్గాల మద్దతు లభిస్తుండటం గమనార్హం. న్యాయవాదులు, బయటివర్గం వారు కూడా ఆయన గెలుపును కోరుకోవడం సర్వత్రా ఆసక్తికరంగా నిలిచింది.




